# పోలింగ్ విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

### ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 19 : ఎన్నికల ప్రక్రియలో అతి కీలకమైన పోలింగ్ విధులపై అధికారులు, సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న తప్పిదానికి సైతం ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని, ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా మాక్ పోల్ నిర్వహించిన తర్వాత డాటాను తప్పనిసరిగా తొలగించాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియను ప్రారంభించే సమయంలో కంట్రోల్ యూనిట్ డేటా జీరో ఉందా లేదా అన్నది తప్పక పరిశీలించుకోవాలని అన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి అనే వివరాలను జాగ్రత్తగా సరిపోల్చుకోవాలని అన్నారు. 17-ఏ, 17-సీ వివరాలతో కంట్రోల్ యూనిట్ వివరాలు సరిపోవాలని అన్నారు. ఓటింగ్ యంత్రాల్లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు.

పోలింగ్ సజావుగానిర్వహిస్తే కౌంటింగ్ సాఫీగా జరిగి, ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుందని.. పోలింగ్ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు సంజీవ్, గోపాలకృష్ణ, ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇందల్వాయి, అక్టోబర్ 19 : మండలకేంద్రంలో నేడు (శుక్రవారం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, సీఈవో రతన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీసీవో సింహాచలం ఉదయం 11 గంటలకు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యే బాజిరెడ్డిని కలిసిన నాయకులు


రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ, అక్టోబర్ 19 : మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లో గురువారం కలిసి సన్మానించారు. మండలంలోని వర్జిన్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జడ్పీటీసీ సభ్యుడు మాన్‌సింగ్, సర్పంచ్ సంగ్లూ నాయక్, ఉపసర్పంచ్ సంతోష్‌నాయక్, వీడీసీ సభ్యులు శంకర్, శివరాంరాజు తదితరులు ఉన్నారు.

## 'గ్రామాల్లో బ్యానర్లు లేకుండా చూడాలి'

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 19 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, గోడలపై రాతలు లేకుండా చూడాలని తహసీల్దార్ ఎంఏ ఖలీం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో గిర్దావర్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ నవీన్, వివిధ గ్రామాల బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్ ఖలీం

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 19 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంఏ ఖలీం చెక్కులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో గిర్దావర్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 'గీత పనివారల కుటుంబాలపై వీడీసీ దాడులను అరికట్టాలి'

కోటగిరి, అక్టోబర్ 19 : గీతకార్మికుల కుటుంబాలపై గ్రామాభివృద్ధి కమిటీల దాడులను అరికట్టాలని గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో 65వ వార్షికోత్సవాన్ని మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ధర్మభిక్షం నాయకత్వంలో 1957లో సంఘాన్ని స్థాపించి, గీత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకట్‌గౌడ్, సురేశ్‌గౌడ్, పండరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఎదుట బైండోవర్

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 19 : మండలానికి చెందిన పలువురిని పోలీసులు గురువారం బైండోవర్ చేశారు. గత ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా పార్టీల జెండాలు పెట్టుకుని ర్యాలీ నిర్వహించిన వారిని ముందస్తుగా పోలీసులు హెచ్చరించి, తహసీల్దార్ ఎంఏ ఖలీం ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరూ ఉల్లంఘించవద్దని తహసీల్దార్ సూచించారు.

## బాజిరెడ్డి జగన్‌ను కలిసిన గుండారం వీడీసీ సభ్యులు


జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్‌ను సన్మానిస్తున్న గుండారం వీడీసీ సభ్యులు, నాయకులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 19 : మండలంలోని గుండారంలో నూతనంగా ఏర్పడిన వీడీసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్‌ను ఆయన నివాసంలో గురువారం కలిసి సన్మానించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు అంకల గంగాధర్, సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, వీడీసీ చైర్మన్ సాయికుమార్, క్యాషియర్ నాశెట్టి పోతన్న, ఉపాధ్యక్షుడు ఎస్‌కే పాషా, కార్యదర్శి గంగారాం, బీఆర్‌ఎస్ నాయకులు ఉమాపతి, జమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రైజింగ్ యూత్ సభ్యులు

ఇందల్వాయి, అక్టోబర్ 19 : మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన వకీల్ రాణి కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నది. విషయం తెలుసుకున్న రైజింగ్ యూత్ ప్రతినిధులు బాధిత కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. బాధితులకు ఆర్థిక సాయం అందిస్తుండడంపై యూత్ సభ్యులను సర్పంచ్ తేలు విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్, కోశాధికారి గణేశ్, కార్యదర్శి సంతోష్, సభ్యులు నవీన్, మహిపాల్‌రెడ్డి, రాకేశ్, రమేశ్, ప్రమోద్, వెంకటేశ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

### కార్యకర్తలకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి సూచన


సమావేశంలో మాట్లాడుతున్న పోచారం సురేందర్‌రెడ్డి

మోస్రా (చందూర్), అక్టోబర్ 19 : రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మోస్రా మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గుత్ప విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, రాంరెడ్డి, సాయాగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 25న అలయ్ బలయ్

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 19 : ఇందూరు యజ్ఞ సమితి, వ్యాసపురి కన్యకా పరమేశ్వరి చారిటబుట్ ట్రస్ట్-బాసర ఆధ్వర్యంలో ఈ నెల 25న దసరా ఆత్మీయ సమ్మేళనం, డాక్టర్ మూడ నాగభూషణం గుప్తా జీవనసాఫల్యం, ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని కార్యక్రమ సమన్వయకర్త మద్దుకూరి సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని హోటల్ నిఖిల్ సాయిలో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ చరిత్రకారుడు కందకుర్తి యాదవ్‌రావు, పంచరెడ్డి లక్ష్మణ్, మెజీషియన్ రంగనాథ్, రాకేశ్ వైద్య, చింతల గంగాదాస్, చెన్న శంకర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి, విశిష్ట అతిథులుగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ బి. రామ్‌ప్రకాశ్, నగర మేయర్ దండు నీతూకిరణ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆరుట్ల రాజేశ్వర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ల గుర్తింపు


బాధితులకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు

నిజామాబాద్‌క్రైం, అక్టోబర్ 19 : నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు సెల్‌ఫోన్లను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు గురువారం అందజేశారు. నాలుగు ఫోన్లను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో గురువారం అందజేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, తక్కువ ధరకు విక్రయిస్తున్నారని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద సెల్‌ఫోన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు.